జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఖమ్మం

ఆదివారం | 17 | మే | 2026 ◆ పేజీలు : 4



## లైసెన్స్ సర్వేయర్లకు భవిష్యత్తులో విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తాం...

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- భూ భారతీ పోర్టల్ మ్యాపింగ్, రిజిస్ట్రేషన్ల ద్వారా సర్వేయర్లకు ఆదాయం వచ్చే అవకాశాలు
- రీ సర్వే కార్యక్రమాల్లో అవసరాన్ని బట్టి లైసెన్స్ సర్వేయర్లను వినియోగిస్తాం




- లైసెన్స్డ్ సర్వేయర్లతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** లైసెన్స్డ సర్వేయర్లకు భవిష్యత్తులో విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని జిల్లా కలెక్టర్

మిగతా 2 లో...




# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి

- ప్రతి ఇంటికి బీఎల్వో చేరుకొని పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలి
- నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.శనివారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు,సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం, మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను సమన్వయం చేసుకుని మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఎస్ఐఆర్ షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుండి 24 వరకు సన్నాహక చర్యలు, శిక్షణా కార్యక్రమాలు

మిగతా 2 లో...

## ఇందిరా మహిళా డెయిరీ అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలి




- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- నిధులు వృథా కాకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలి
- గ్రామ, మండల స్థాయిలో మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులు సమాంతరంగా చేపట్టాలి
- ఉపాధి హామీ ద్వారా మౌళిక సదుపాయాల పనులకు వెంటనే పరిపాలనా అనుమతులు పొందాలి
- ఇందిరా మహిళా డెయిరీపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమం అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఇందిరా మహిళా డెయిరీ

మిగతా 2 లో...

## మే 18న నిర్వహించే మాక్ ఎక్సర్సైజ్‌కు పటిష్ట ప్రణాళిక

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి
- విపత్తుల నిర్వహణ పట్ల మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించాలి
- వరద ప్రమాదాల నియంత్రణపై జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ సూచనల మేరకు నిర్వహించనున్న మాక్ ఎక్సర్సైజ్ పై సమీక్షించిన అదనపు కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** మే 18న ఉదయం 8 గంటల నుండి నిర్వహించనున్న మాక్ ఎక్సర్సైజ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళిక సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు.వరద ప్రమాదాలు సంభవించినప్పుడు స్పందించాల్సిన తీరుపై జిల్లాలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించాలని, దీనికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్ల పై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షించి పలు సూచనలు చేశారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ

మిగతా 2 లో...

## రూ.6.55 కోట్లతో నిర్మించనున్న చెక్ డ్యామ్

- నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు.
- ఖమ్మం-సూర్యాపేట జిల్లాలో 330 ఎకరాలకు సాగు జలాలు. రైతులను ఒప్పించేందుకు కౌన్సిలింగ్ నిర్వహించిన అధికారులు.



**నేలకొండపల్లి, మే 16 ప్రజా జ్యోతి** :మండలం లోని కట్టుకాచారం లో రూ.6.55కోట్లతో నిర్మించనున్నచెక్ డ్యామ్ నిర్మాణానికి సంబంధించిన స్థలం ను రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు శనివారం స్థల పరిశీలన చేశారు. రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తో మండలం లోని కట్టుకాచారం లో పాలేరు ఏటి పై చెక్ డ్యామ్ ను నిర్మించేందుకు రూ.6.55 కోట్లను మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం చెక్ డ్యామ్ అవసరమైన స్థలం ను

మిగతా 2 లో...

## లైసెన్స్డ్ సర్వేయర్లకు భవిష్యత్తులో విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తాం..

(మొదటి పేజీ తరువాయి...)

దివాకర టిఎస్ తెలిపారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి లైసెన్స్డ్ సర్వేయర్లతో పలు అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా లైసెన్స్డ్ సర్వేయర్లు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చి తమకు శిక్షణ, అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన తర్వాతే లైసెన్స్‌లు జారీ చేశారని తెలిపారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం భూ భారతీ పోర్టల్ మ్యాపింగ్ ప్రక్రియ అమలులోకి వచ్చిందని,తిరుమలాయపాలెం మండలంలో రీ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ ప్రక్రియలో కొంతమంది లైసెన్స్ సర్వేయర్లను వినియోగిస్తున్నామని,భవిష్యత్తులో భూముల కొనుగోలు, రిజిస్ట్రేషన్ల సమయంలో మ్యాపింగ్ విధానం అమలులోకి వస్తుందని, కూసుమంచి గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు.రానున్న రోజుల్లో అన్ని గ్రామాల్లో అమలు చేస్తామని, దీంతో లైసెన్స్ సర్వేయర్లకు పని, ఆదాయం లభిస్తాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ఉపాధి అవకాశాల కల్పనపై సానుకూలంగా ఉందని,దీనికి కొంత సమయం అవసరమని తెలిపారు. రీ సర్వే సమయంలో అవసరాన్ని బట్టి లైసెన్స్ సర్వేయర్లను వినియోగిస్తామని రిజిస్ట్రేషన్ల సమయంలో కూడా ఆదాయం వచ్చే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులు సర్వేలు చేయించుకున్నా కూడా సర్వేయర్లకు ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. వ్యవస్థ పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చిన తర్వాత లైసెన్స్డ్ సర్వేయర్లకు క్రమంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.సర్వే ఫీజుల పెంపు అనేది జిల్లా స్థాయిలో తీసుకునే నిర్ణయం కాదని, ప్రభుత్వం నిర్ణయించాల్సిన అంశమని కలెక్టర్ తెలిపారు. లైసెన్స్ సర్వేయర్ సేవలు అవసరాన్ని బట్టి ఉండే సేవలని చెప్పారు. ప్రస్తుతం రోజుకు 500 నుంచి 600 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, భవిష్యత్తులో క్రమంగా రెగ్యులర్ పని వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి మండలంలో నెలకు సగటున 200 నుంచి 250 వరకు లావాదేవీలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో ప్రతి లైసెన్స్డ్ సర్వేయర్‌కు వారి పనిని బట్టి ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు.లైసెన్స్డ్ సర్వేయర్లు ఇచ్చిన వినతులను ప్రభుత్వానికి పంపిస్తామని, కొన్ని విధాన పరమైన నిర్ణయాలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఫీల్డ్‌లో ఎవరైనా తప్పులు చేస్తే వారి లైసెన్స్ రద్దు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో లైసెన్స్డ్ సర్వేయర్లు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మే 18న నిర్వహించే మాక్ ఎక్సర్సైజ్‌కు పటిష్ట ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి...)

విపత్తులనిర్వహణ అథారిటీ సూచనలు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మున్నేరు వరదలు లేదా ఇతర భారీ వరదలు సంభవించినప్పుడు అధికార యంత్రాంగం స్పందించాల్సిన తీరు పై మాక్ ఎక్సర్సైజ్ మే 18న నిర్వహణకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు.జిల్లాలోని నీటి వనరులపై నిరంతరం నిఘా,భారీ వరదల సమయంలో నీటి విడుదల కోసం ఎగువ, దిగువ ప్రాంతాలతో సమన్వయం, విపత్తుల సమయంలో వెంటనే ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్డిఆర్‌ఎఫ్, ఆపద మిత్ర వంటి విపత్తు స్పందన బృందాలకు సమాచారం చేరేలా వ్యవస్థ సిద్ధంగా ఉండాలని తెలిపారు.సహాయక శిబిరాలు,ప్రజల తరలింపు,అత్యవసర వైద్య సేవలు, అగ్నిమాపక చర్యలు, కమ్యూనికేషన్ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఎస్ఐ లు ఏ.విశ్వతేజ,పి.వెంకటేష్, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## రూ.6.55 కోట్లతో నిర్మించనున్న చెక్ డ్యామ్

(మొదటి పేజీ తరువాయి...)



పరిశీలించారు. చెక్ డ్యామ్‌కు అవసరమైన స్థలం ను ఎంపిక చేశారు. హద్దులు ఏర్పాటు చేశారు. ఈ చెక్ డ్యామ్ వలన ఖమ్మం జిల్లాలో కట్టుకాచారం– సూర్యాపేట జిల్లాలోని కొత్తగూడెం గ్రామాలలో భూగర్భజలాలు పెంచటంతో పాటు 330 ఎకరాల ఆయకట్టుకు సాగు జలాలు అందనున్నాయి. కాగా ఓ రైతు చెక్ డ్యామ్ వలన తన పొలం కోత కు గురవుతుందని అభ్యంతరం చెప్పారు. ఈ మేరకు నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్, ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు లు రైతు కు కౌన్సిలింగ్ నిర్వహించారు.సోమవారం నాటికి సమస్య ను పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ ఆలస్యం మధుసూధ న్రావు, ఇరిగేషన్ ఏఈ నరేష్, సర్వేయర్ మదనమోహాన్, సర్పంచ్ బీ.సైదులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. చెక్ డ్యామ్ కు నిధులు మంజూరు చేయించిన మంత్రి శ్రీనివాసరెడ్డి కి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొడాలి గోవిందరావు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ కాలంలో బీఎల్ఓ లు, ఎన్నికల సిబ్బందికి ఎస్ఐఆర్‌పై పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి బీఎల్ఓకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు.ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హమైన ఓటరుని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, కొత్త క్లెయిమ్‌లు,దరఖ




ాస్తులను క్షేత్రస్థాయి లో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని,ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యంచేయరాదని సూచిం చారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని,సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ గత వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో మంచి పురోగతి సాధించామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన అన్ని సూచనలను అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు.ప్రజల వద్ద నివాస ధ్రువీకరణకు సంబంధించిన ధ్రువపత్రాలు లేని సందర్భాల్లో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహన, పట్టు ఉన్న సమర్థులైన బీఎల్‌వోలను నియమించాలని ఆదేశించారు.ఏ ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అత్యంత జాగ్రత్తగా పని చేయా లని తెలిపారు. అన్ని బీఎల్‌వోలకు పూర్తిస్థాయి శిక్షణ అందించాలని, క్షేత్రస్థాయిలో ప్రజలతో మాట్లాడే సమయంలో ఎవరూ నిర్లక్ష్యంగా లేదా అన వసర వ్యాఖ్యలు చేయరాదని స్పష్టం చేశారు.ఏదైనా ఓటరు పేరు జాబితా లో లేకపోతే అందుకు గల కారణాన్ని స్పష్టంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం యొక్క ప్రధాన అజెండా అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా చూడటమేనని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రతి అభ్యంతరం, క్లెయిమ్, దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.బీఎల్‌వోలు, ఎన్నికల సిబ్బంది ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ శ్రీనివాస్,సంబంధిత జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ అన్సారి, పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా డెయిరీ అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలి

(మొదటి పేజీ తరువాయి...)

కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రతి శాఖకు కేటాయించిన లబ్ధిదారుల లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ విడుదల అనంతరం అందుబాటులో ఉన్న నిధుల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, పశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమానికి సంబంధించి బడ్జెట్ త్వరగా విడుదలయ్యేలా ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, మైనారిటీ శాఖల ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్ ఫోన్ ద్వారా మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. విడుదలైన నిధులు సక్రమంగా వినియోగం అయ్యేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని,యూనిట్లు నిర్దేశిత కాల వ్యవధిలో గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిధులు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమానికి అవసరమైన గ్రామ స్థాయి, మండల స్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను సమాంతరంగా చేపట్టాలని, దీనిపై సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులు వెంటనే పొందాలని సూచించారు.కొంతమంది లబ్ధిదారులకు అవసరమైన పశువుల షెడ్ల నిర్మాణాలను ఉపాధి హామీ క్రింద పరిగణనలోకి తీసుకుని, వాటిని నిర్ణీత సమయంలో పూర్తి చేసే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రారంభంగా వినియోగిస్తున్న డీఎంఎఫ్‌టీఈ నిధులను, ఉపాధి హామీ నిధులు మంజూరైన తర్వాత తిరిగి జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో సభ్యులకు మంజూరైన పశువుల షెడ్ల నిర్మాణాలకు సంబంధించి, ఆసక్తి చూపిస్తూ ముందుండి పనులు చేపట్టే లబ్ధిదారులను ఎంపీడీవోలు గుర్తించాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో ఇప్పటికే పనులు ప్రారంభమైన లబ్ధిదారుల కోసం అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. ప్రగతిశీల లబ్ధిదారులకు పనులు ప్రారంభించేందుకు అడ్వాన్స్ మొత్తాన్ని అందించి, అనంతరం ఉపాధి హామీ నిధులు వచ్చిన తర్వాత ఆ మొత్తాన్ని తిరిగి జమ చేసే విధానాన్ని పారదర్శకంగా,ఖచ్చితంగా పర్యవేక్షించాలని అధికారులకు తెలిపారు.పశువుల షెడ్ల నిర్మాణం పటిష్టంగా,నాణ్యతతో ఉండేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు.అర్హులైన లబ్ధిదారులకు సోలార్ వ్యవస్థ ఏర్పాటును కూడా చేపట్టాలని ఆదేశించారు. రెడ్కో అధికారులతో సమన్వయం చేసుకుని అర్హతలను పరిశీలించాలని సూచించారు. సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు సాధ్యమైన ప్రాంతాలను సాంకేతికంగా పరిశీలించి,అనుకూల ప్రాంతాల్లోనే పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా డెయిరీ వచ్చే రెండు సంవత్సరాల్లో పూర్తిస్థాయి స్వయం సమృద్ధి సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ప్రతి బీఎంసీ వద్ద బ్రేక్ ఈవెన్ సాధించేందుకు రోజుకు ఎంత లీటర్ల పాలు సేకరించాల్సి ఉంటుందో అంచనా వేసి, ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.డెయిరీ స్థిరత్వం కోసం ఎంత మేర పాలు సేకరించాలి, సేకరించిన పాలను ఎక్కడ విక్రయించాలి అనే అంశాలపై పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళికను వచ్చే మంగళవారం లోగా సమర్పించాలని ఆదేశించారు.గరిష్టంగా 10రోజుల ఆపరేషనల్ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకొని ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి 10 రోజులకు వ్యాపారం ద్వారా నిధులు అందే విధంగా ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌పై స్పష్టమైన ప్రణాళిక ఉండాలని తెలిపారు.ఇందిరా మహిళా డెయిరీ నిర్వహణలో ఆదాయం,వ్యయం,పాల సేకరణ, మార్కెటింగ్, తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణను పకడ్బందీగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ అధికారులు చొరవతో పనిచేసి కేటాయించిన బడ్జెట్ సమయానికి విడుదలై, సక్రమంగా వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో డిఆర్డిఓ శ్రీరామ్, సిపిఓ శ్రీనివాస్, బిసి అభివృద్ధి అధికారి జి.జ్యోతి,ఇంచార్జీ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి ముజాహిద్, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి పురంధర్,పంచాయతీ రాజ్ ఈఈ మహేష్,విజయ డెయిరీ డిడి కె.రవి కుమార్, డిఆర్డిఓ ఏపిడి జయశ్రీ, వ్యవసాయ శాఖ ఏడిఏ ఎస్. విజయ్ చంద్ర, ఏపిఎంలు, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి






- **బిజెపి డౌన్ డౌన్ అంటూ ర్యాలీ... కాంగ్రెస్ పార్టీ**

**సత్తుపల్లి మే16(ప్రజా జ్యోతి )** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ రేట్లు పెంచడంపై సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు,శనివారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా,ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నుండి బాలాజీ థియేటర్,నుండి రింగ్ సెంటర్ వరకు బిజెపి డౌన్, డౌన్ అంటూ పెంచిన పెట్రోలు డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ ప్రజలపై పెంచిన పెట్రోల్, డీజిల్ రేట్లు వలన ప్రజలకు తీవ్ర ప్రభావం పడుతుందని, బిజెపి కేంద్ర మొండి వైఖరిపై నిరసన తెలియజేశారు. సామాన్యులపై భారం మోపుతూ,నష్టం వాటిల్లే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవర్తిస్తుందని, బిజెపి పద్ధతి మార్చుకోవాలి,రేట్లు తగ్గించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు చల్లగుండ్ల నరసింహారావు, కృష్ణయ్య,సత్తుపల్లి నియోజక వర్గం ఎస్సీ,బీసీ, ఎస్టీ సెల్ కాంగ్రెస్ నాయకులు ,కొత్తూరు ఉప సర్పంచ్ గొర్లమారి రామ్మోహన్ రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కల్లూరు మండలంలో రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం

- **మానవతా సేవకు పిలుపు**



**కల్లూరు, మే 16 : ప్రజా జ్యోతి** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం జిల్లా శాఖను బలోపేతం చేసే దిశగా మే నెల లో ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమం కల్లూరు మండలంలో ఘనంగా ప్రారంభమైంది. ఐ ఆర్ సి ఎస్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు సంస్థాగత బలోపేతంతో పాటు క్షేత్ర స్థాయిలో రెడ్ క్రాస్ ఉద్యమాన్ని విస్తరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కల్లూరు డివిజన్ గౌరవ సబ్ –కలెక్టర్ అజయ్ యాదవ్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సీనియర్ సభ్యులు, గ్రీన్ వారియర్ జే వి ఎస్ చంద్ర శేఖర్, ఉపాధ్యక్షులు పాకాలపాటి రమేష్ తదితరులు పాల్గొని సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, మానవతా సేవా దృక్పథమే రెడ్ క్రాస్ మూల సిద్ధాంతం. ప్రకృతి వైపరీత్యాలు, ఆరోగ్య అత్యవసరాలు, రక్తదానం వంటి సేవా కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ పాత్ర కీలకం. జిల్లాలో ప్రతి మండలం, గ్రామ స్థాయిలో సేవాభావం కలిగిన యువత, ప్రజలు సభ్యులుగా చేరి ఉద్యమాన్ని బలోపేతం చేయాలి అని పిలుపునిచ్చారు. ఆసక్తి గలవారు స్థానిక రెడ్ క్రాస్ ప్రతినిధులను లేదా కల్లూరు మండల కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. జీవితకాల సభ్యత్వంతో పాటు వార్షిక సభ్యత్వ అవకాశాలు కూడా అందుబాటులో ఉన్నాయి. రెడ్ క్రాస్ ఉద్యమం ద్వారా విపత్తు సమయాల్లో తక్షణ సహాయం, వైద్య శిబిరాలు, ప్రథమ చికిత్స శిక్షణ వంటి సేవలు అందుతాయి. ఈ నెల మొత్తం జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కొనసాగనుంది తెలిపారు.

# బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

- **సీపీఎం ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం.**






**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి:** పొక్సో కేసులో నిందితుడైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథును వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం ఏదులాపురం మున్సిపాలిటీ కమిటీ కార్యదర్శి ఉరడీ సుదర్శన్ రెడ్డి,ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.భగీరథును అరెస్టు చేయాలని కోరుతూ సీపీఎం మండల కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ క్రాస్ రోడ్ లో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి,నాగేశ్వరరావు మాట్లాడుతూ...భగీరథ్ పై కేసు నమోదై ఐదు రోజులు అవుతున్న భగీరథను అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు.కాంగ్రెస్,బీజేపీ ఒక్కటై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు.చట్టం ముందు అందరూ సమానులేనని పేదవాళ్లకు ఒక న్యాయం,పెద్దలకు ఒక న్యాయమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తన నిజాయితీని నిరూపించుకొని భగీరథను వెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలన్నారు.బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెరుమళ్ళపల్లి మోహన్ రావు,ప్రతాపనేని వెంకటేశ్వర్లు,భూక్య నాగేశ్వరరావు,పెంట్యాల నాగేశ్వరరావు,కొండం కరుణాకర్,చావా నాగేశ్వరరావు,ఏటుకూరి ప్రసాదరావు,భూక్య కృష్ణ,ఐద్వా మండల అధ్యక్షురాలు ఏటుకూరి పద్మ,నాయకుల గుంటి వెంకన్న,దండగల రాంబాబు,కర్లపూడి వెంకటేశ్వర్లు,కస్తాల అంటోనీ,కుమ్మరికుంట్ల శ్రీను,మాదరబోయిన ఉదయ్,ధనియకుల రామయ్య,మొక్కా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ ,డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి

- **మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టిన నాయకులు**




**బోనకల్, మే 16(ప్రజా జ్యోతి ):** పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగ్గించాలని సిఐటియు జిల్లా నాయకులు బోయినపల్లి వీరబాబు, సిఐటియు బోనకల్ మండల కన్వీనర్ గుగులోత్ నరేష్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక ఖమ్మం సెంటర్లో సిఐటి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గత 20 రోజుల నుండి డీజిల్ , పెట్రోల్ వరద విపరీతంగా చేసి రెండు మూడు రోజులు వాహనదారులకు నాన్న అవస్థలు పెట్టిందన్నారు. ఇప్పుడు చావు కబురు చల్లగా చెప్పినట్టు లీటర్ డీజిల్, పెట్రోలు కు మూడు రూపాయలు చొప్పున పెంచడం ఇది బాధాకరమన్నారు. మోడీ దేశంలో బడా పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతున్నారని ,వాళ్ల జేబులు నింపుతూ పేద ప్రజలు నడ్డి విరుస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తక్షణమే తగ్గించాలని, లేనిపక్షంలో కార్మికుల్ని ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ఆటో యూనియన్ అధ్యక్షులు తాళ్లూరి శ్రీకాంత్ , వైరా అడ్డ ఆటో యూనియన్ అధ్యక్షులు నాగంటి బాబు, ట్రాన్స్పోర్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎస్కే గౌస్ , నాయకులు ఎస్కే సైదా, ఎస్కే మస్తాన్, నాగేశ్వరరావు, డి కృష్ణ, రామారావు, ఎస్ కే ఇబ్రహీం, ఎస్కే సైదా తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థాలు తిని...ఓ ఆవు మృతిక మరో ఆవు పరిస్థితి విషమం




**నేలకొండపల్లి, మే 16 ప్రజా జ్యోతి:** పంక్షన్ల వద్ద మిగిలిన ఆహార పదార్థాలు.. ప్లాస్టిక్ కవర్స్ లాంటి వ్యర్థాలు తిని రెండు ఆవులలో ఒకటి మృతి చెందగా..మరో ఆవు పరిస్థితి విషమంగా ఉంది.. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని మంగాపురం తండాకు చెందిన బోడ జగ్గయ్య అనే రైతు కు చెందిన రెండు ఆవులు శనివారం గ్రామ శివారు లో వేసిన వ్యర్థాలను తిని అసవస్థత కు గురైయ్యాయి. రూ.50 వేల విలువైన ఆవు చనిపోయింది. కాగా మరో ఆవు పరిస్థితి విషమంగా మారింది. పశుమిత్ర లు వైద్య సేవలు అందిస్తున్నారు. చనిపోయిన ఆవు వద్ద లేగదూడలు అరుస్తున్న తీరు పలువురు ను కంటతడి పెట్టిస్తుంది. వ్యర్థాలు తిని గతం లో కూడ ఆవు మృతి చెందింది. రహదారుల వెంట వ్యర్థాలు వేయవద్దని.. డంపింగ్ యార్డ్ వద్ద వేయాలని పంచాయతీ సర్పంచ్ ధీరావత్ అశోకా రాణి కోరారు. మూగజీవాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రజలు సహకరించాలని కోరారు.

# సమిష్టి కృషితో లక్ష్యాలను సాధిద్దాం...

- **జిఎం చింతల శ్రీనివాస్**



**సత్తుపల్లి మే16(ప్రజా జ్యోతి )** సమిష్టి కృషితో సింగరేణి ఇచ్చిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని,సింగరేణి జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మీడియా మిత్రులతో సమావేశాన్ని ఆయన కార్యాలయంలో, అన్ని డిపార్ట్మెంట్ల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కంపెనీ గత సంవత్సరం సాధించిన ఉత్పత్తి లక్ష్యాలను,ఈ సంవత్సరం సాధించవలసిన లక్ష్యాలను వివరాలను వివరించారు. సంస్థ వ్యాప్తంగా 65:00 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాలను సంస్థలో సవాల్ గా అధికమిస్తూ,సత్తుపల్లి 110:00 మిలియన్ టన్నులు, ఓసి లో 24:00 మిలియన్ టన్నులు, జేవియర్ సిహెచ్ పి కి నిర్దేశించిన 134:00 మిలియన్ టన్నుల రవాణా లక్ష్యాలను,సాధించే దిశగా కార్మికులను,సూపర్వైజర్స్, ఆఫీసర్లను,అప్రమత్తం చేయటానికి మల్టీ డిపార్ట్మెంట్ టీం యొక్క ఉద్దేశం ఉందని అన్నారు. ఈనెల 19,20,21 తారీకుల్లో మల్టీ డిపార్ట్మెంట్ల టీమ్స్ జెవిఆర్ఓసి లో,కిష్టారం ఓసి లో జేవిఆర్,సిహెచ్ పి లో నిర్వహించడం జరుగుతుందని,ఈ టీం సభ్యులు బొల్లం శ్రీనివాస్, డీజీఎం సోమశేఖర రావు, ఏజీఎం బీభత్స,పర్సనల్ మేనేజర్ తిరుపతి, డీజిఎం యోహాన్,అడిషనల్ మేనేజర్ సత్యనారాయణ రాజు పర్యటిస్తారని, అదేరోజు సాయంత్రం జేవిఆర్ఓసి, కిష్టారం ఓసి, జేవియర్ సిహెచ్పి విభాగాలలో పనిచేస్తున్న ఆఫీసర్లు,యూనియన్ ప్రతినిధులు,ఉత్తమ ఉద్యోగులతో సమావేశంలో వారి సలహాలను, సూచనలను స్వీకరించటం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో మల్టీ డిపార్ట్మెంట్ టీం సభ్యులు కృష్ణారావు ,ప్రాజెక్టు ఆఫీసర్ ఏ ఎల్ ఎస్ వి సునీల్ వర్మ, జేవిఆర్ఓ సి ప్రాజెక్టు ఇంజనీర్ డి శ్రీనివాసరావు, జేవిఆర్ఓసి ఎస్ఓఎం బి రాజేశ్వరరావు, కిష్టారం ఇంచార్జ్ మేనేజర్ వి బాబు, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ సత్యనారాయణ , బ్రాంచ్ సెక్రటరీ ఏ ఐ టి యు సి ఎస్ సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ ఐఎన్టియుసి బీ కోటేశ్వరరావ, కే శ్రీనివాస్ వెల్ఫేర్ ఆఫీసర్,డిపార్ట్మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలి

- పి ఓ డబ్ల్యు పాలేరు డివిజన్ కార్యదర్శి గోకినపల్లి సరోజిన



**తిరుమలాయపాలెం మే 16 ప్రజా జ్యోతి** మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన బండి సాయి భగీరథను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ అనుబంధ ప్రగతి శీల మహిళా సంఘం (పి .ఓ .డబ్ల్యు) పాలేరు డివిజన్ కార్యదర్శి గోకినపల్లి సరోజిని మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అయినా బండి సంజయ్ కుమారుడు కావటం వల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు p చుట్టాలుగా మారాయని వెంటనే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి భేషరతుగా కొడుకుని పోలీసు వ్యవస్థ గొప్ప చెప్పాలని సరోజిని అన్నారు. దేశంలో రాష్ట్రంలో మహిళలపై నిత్యం అఘాయిత్యాలు జరుగుతున్నా ప్రభుత్వాలు వీటిని అరికట్టడంలో విఫలం ఇవ్వడమే కాకుండా ఉన్నోడిదే చట్టం అన్న చందంగా ఉన్నవాడు ఏమి చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో బండి సాయి భగీరథ మైనర్ బాలిక పై చేసిన లైంగిక దాడి సమాజానికంతటికి తెలిసినప్పటికీ ప్రభుత్వాలు అధికారులు బండి భగీరథు ని అరెస్ట్ చేయడంలో జాప్యం జరుగుతున్నది దీనికంతటికి కారణం భగీరథకు బిజెపి పార్టీ రాజకీయ పలుకుబడి ఉండడమే మరియు ధనవంతులకు, పేదలకు, తేడాల వల్ల ఇది జరుగుతుందని మేము భావిస్తున్నాం దేశంలో రాష్ట్రంలో జరిగే అగైత్యాలను ప్రభుత్వాలు అరికట్టడంలో చొరవ తీసుకోవాలని ప్రజలకు రక్షణగా ఉండాలని కోరుతున్నాం ఈ లైంగిక దాడిలో పాల్గొన్న బండి భగీరథను వెంటనే అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సరోజినీ అన్నారు.

## మహిళల హక్కుల ఉల్లంఘన జరుగుతుంది

- ఏపూరి లతాదేవి, డాక్టర్ కాపా చంద్రకళ







**వైరా మే 16 ప్రజా జ్యోతి** మహిళల పట్ల నేటికీ సమాజంలో వివక్ష కొనసాగుతూనే ఉంది, వేధింపులు అత్యాయత్నాలు దాడులు కొనసాగుతూనే ఉన్నాయని, మహిళల హక్కుల ఉల్లంఘన జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర మహిళా సమైక్య రాష్ట్ర కార్యదర్శి వేపూరి లతాదేవి అన్నారు. ఆ సంఘ 22వ మహాసభలు శనివారం కమ్మ కళ్యాణ మండపంలో జరిగాయి ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాకా చంద్రకళ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని బాల్య వివాహాలను నియంత్రించాలని అన్నారు. ఈ మహాసభలో అనేకమైన హక్కుల తీర్మానాలను చేశారు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాగం ఏమంతరావు వైరా నియోజకవర్గ కార్యదర్శి ఎర్రబాబు, జిల్లా నాయకులు దొండపాటి రమేష్, మండల కార్యదర్శి యామాల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ డీ కొని ద్విచక్ర వాహన దారుడు మృతి

- ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ తోనే ఈ ప్రమాదం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న బోనకల్ పోలీసులు



**బోనకల్, మే 16 (ప్రజా జ్యోతి):** రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డీకోని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బోనకల్ మండల కేంద్రంలో తెలంగాణ ఆంధ్ర చెక్ పోస్ట్ సరిహద్దు ప్రాంతంలో శనివారం రాత్రి 8 గంటల సమయంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... తల్లాడ మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన లింగం నరసింహారావు (30) తన ద్విచక్ర వాహనంపై ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లా వత్సవాయి నుండి వస్తున్నాడు. అదే సమయంలో బోనకల్ మండల కేంద్రానికి చెందిన బండి నాగేశ్వరరావు ట్రాక్టర్ తన ఇంటి నిర్మాణం కొరకు ఐరన్ చువ్వలు తీసుకు వద్దామని బోనకల్ నుండి వత్సవాయి కి వెళ్తున్నాడు. అటువైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడు లింగం నరసింహారావు ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వెళుతున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ద్విచక్రదారుడు లింగాల నరసింహారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఢీ కొట్టిన ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ తో ఓవర్ టెక్ చేయబోయి ద్విచక్ర వాహనానికి తగిలి ఆంధ్ర తెలంగాణ సరిహద్దు చెక్ పోస్ట్ దాటడంతో ట్రాక్టర్ వెనుక వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు వెళ్లి ట్రాక్టర్ తగిలి వ్యక్తి చనిపోయాడని ఆంధ్ర చెక్ పోస్ట్ లో ఉన్న పోలీసులకు చెప్పగా వెంటనే చెక్ పోస్ట్ లో ఉన్న ఆంధ్ర పోలీసులు ఆ ట్రాక్టర్ ను అక్కడ ఆపి బోనకల్ ఎస్సై పొదిలి వెంకన్నకు సమాచారం అందించారు. వెంటనే బోనకల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతుడి వివరాలు సేకరించారు. మృతుడు తల్లాడ మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడికి భార్య ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని వెంటనే బోనకల్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు సేకరించిన బోనకల్ పోలీసులు వెంటనే ఢీ కొట్టిన ట్రాక్టర్ ను బోనకల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోనకల్ ఎస్సై పొదిలి వెంకన్న తెలిపారు.

## కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందించడమే ప్రభుత్వ ధ్యేయం









**చింతకాని మే 16 ప్రజాజ్యోతి ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సారథ్యంలో విద్యాశాఖకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలతో విద్యా రంగాన్ని బలోపేతం చేస్తోంది. ప్రగతి పాలన –ప్రజాపాలనలో భాగంగా మండల కేంద్రమైన చింతకాని రైతు వేదికలో విద్యా వారోత్సవాల కార్యక్రమం ఘనంగా నిర్వహించరు. ఈ సభకు మండల విద్యాశాఖ అధికారి రామారావు అధ్యక్షత వహించగా,ముఖ్య అతిథిగా ఎఎంసి చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తూ ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నదని పేర్కొన్నారు. ఒకప్పుడు ఉన్నత వర్గాల ప్రజలు మాత్రమే కార్పొరేట్ విద్యను పొందగలిగేవారని, ఇప్పుడు పేద ప్రజల పిల్లలకు కూడా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలల ద్వారానే అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకం, ఉచిత యూనిఫాంలు, ఉచిత పాఠ్యపుస్తకాలు అందించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తోందని తెలిపారు. అదేవిధంగా రానున్న విద్యా సంవత్సరంనుంచి విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని కూడా అమలు చేయనున్నట్లు వెల్లడించారు.పేద పిల్లల విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయాలు తెలంగాణలో విద్యా రంగానికి కొత్త దిశానిర్దేశం చేస్తున్నాయని సభలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో చింతకాని తహసీల్దార్ బాబ్జి ప్రసాద్ , ఎంపీడీవో శ్రీనివాసరావు ,ఎస్సై వీరేందర్ ,చింతకాని సర్పంచ్ కిలార్ మనోహర్, నాగులవంచ హెచ్ఎం కనపర్తి వెంకటేశ్వర్లు,కొదుమూరు హెచ్ఎం వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.వివిధ గ్రామాల సర్పంచులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.మండల స్థాయిలో మరియు జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను ఘనంగా సన్మానించి,మెమెంటోలు అందజేయడం జరిగింది. విద్యార్థుల కృషిని అభినందిస్తూ వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

## ఘనంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష జన్మదిన వేడుకలు

- సత్తుపల్లిలో పేదలకు అన్నదానం
- చీపు నరసింహా గౌడ్ పర్యవేక్షణలో నిరుపేదలకు అన్న వితరణ





**సత్తుపల్లి మే16 (ప్రజా జ్యోతి)** పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీష జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలో సత్తుపల్లిలో యువ భారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ఘనం గా నిర్వహించారు. శిరీష జన్మదినం సందర్భంగా పట్టణంలోని నిరుపేదలు, యాచకులు, అనాథలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ ప్రతినిధి చీపు నరసింహ గౌడ్ స్వయంగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి, వందలాది మందికి అన్న వితరణ చేశారు. భోజనంతో పాటు మంచినీరు అందించి పేదల ఆకలి తీర్చారు. యువ భారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై, నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజల ఆశీస్సులు ఎల్ లప్పుడూ ఆమెకు ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే పుట్టినరోజును పురస్కరించుకుని సేవా దృక్పథంతో అన్నదాన కార్యక్రమం చేపట్టి ఉదారత చాటుకున్న చీపు నరసింహ గౌడ్ కు ఫౌండేషన్ సభ్యులకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. పుట్టినరోజు వేడుకలను ఆడంబరాలకు పోకుండా సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈడ వేణు. పామర్తి అశ్రీత్.పరసా గోపి. పరసా చందు.అర్చన సురేష్. ఏకుల నాగార్జునఫౌండేషన్ ప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.